క్లుప్తంగా

హరిహరార్చన పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా హైదరాబాద్ వేద విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో హరిహరార్చన పుస్తకాన్ని ట్రస్టుబోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆవిష్కరించారు ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎంపీ విజయ సాయిరెడ్డికి ముక్కంటి ప్రసాదాలు



ఎంపీకి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం ఏపీసీడ్స్ కూడలి వద్ద రోడ్డు మార్గంలో వెళుతున్న ఎంపీ విజయ సాయిరెడ్డిని మంగళవారం పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి కలిశారు. ఆయనకు ముక్కంటి ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు.

ప్రార్థనా మందిరం ప్రారంభం



పవిత్రారెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: మండలంలోని పుల్లారెడ్డికండ్రిగ దళితవాడలో నూతనంగా నిర్మించిన సీఈఎఫ్ఎం క్రీస్తు దర్శన స్వరం ప్రార్థన మందిరాన్ని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ నాయకురాలు పవిత్రారెడ్డి ప్రారంభించారు. నాయకులు మధురెడ్డి, రవీంద్రరెడ్డి, గంగిరెడ్డి, సురేష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, నాదముని,భాస్కర్ పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఏపీ వైద్య విధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సరళమ్మ ఆదేశించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నాడు-నేడు కింద జరుగుతున్న విస్తరణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఇన్‌ఛార్జి ఆర్ఎంవో డాక్టర్ మధు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ వంద రోజుల పనులు

ఏర్పేడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని మన్నసముద్రం పంచాయతీ పరిధిలో ఉపాధి హామీలో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. కూలీల మస్టర్లను పరిశీలించారు. ఏపీఓ దేవరి, మేట్ వెంకటయ్య పాల్గొన్నారు.

గ్రావెల్ తరలింపు అడ్డగింత

పిచ్చాటూరు: మండలంలోని శ్రీరామాపురం సమీపంలో గ్రావెల్ తరలింపును ఎస్ఎస్‌బీ పేట గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. వివరాలిలా.. శ్రీరామాపురం వద్ద ఉన్న భూములను ఎస్ఎస్‌బీ పేట గ్రామస్తులకు భూ పంపిణీకి స్థలం కేటాయించారు. ఆ స్థలంలో భారీ యంత్రాలతో 15 అడుగులకు పైన తవ్వి తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తున్నారని ఆరోపిస్తూ వాహనాలను ఎస్ఎస్‌బీ పేట గ్రామస్తులు అడ్డుకున్నారు.

గర్భిణులకు మెరుగైన సేవలు

నారాయణవనం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలను అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి అన్నారు. మంగళవారం నారాయణవనంలోని చావడి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

– రూ.69,116 రికవరీకి ఆదేశాలు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : తొట్టంబేడు మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల్లో అక్కడక్కడ అవకవతకలు జరిగినట్లు జిల్లా అధికారులు వెల్లడించారు. తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో ఈ ఏడాది మార్చి 31 వరకు ఎన్ఆర్ఈజీఎస్ కింద జరిగిన 1,130 పనులకు రూ.5,88,24,786 ఖర్చు చేయగా, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన 38 పనులకు రూ.1,59,34,639, ఆర్‌డబ్ల్యూఎస్ కింద చేపట్టిన మరో 5 పనులకు రూ.5,69,641 ఖర్చు చేశారు. ఈ పనులపై ఇటీవల సోషల్ ఆడిట్ తనిఖీ బృంద సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను తనిఖీ చేసి వివరాల నివేదికలను వినిపించారు. పలు పనుల్లో అక్కడక్కడ తప్పులు దొర్లినట్లు నిగ్గుతేల్చడంతో ఫీల్డ్ అసిస్టెంట్లతో సహ పలువురు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఇతర అధికారులకు మొత్తంగా రూ.69,116 రికవరీకి పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మన్ రాసా రాయ నాయుడు, ఏపీడీ ప్రేమ్ కుమార్, ఎంపీడీవో సురేష్‌బాబు పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల వితరణ

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరి సమీపంలోని డేవిడ్‌లూయిస్‌రిస్ ఆస్పత్రిలో పుష్పిత్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం రోగులకు దుప్పట్లు, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, కప్పులు అందజేశారు.

భావితరాలకు జగనన్న భరోసా

నాగలాపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరిస్తే భావితరాలకు జగనన్న పాలన భరోసా కల్పిస్తుందని సత్యవేడు శాసన సభ్యుడు కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కృష్ణాపురం సచివాలయంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో ఎంపీడీఓ పీకేఎం బాబు అధ్యక్షతన రాష్ట్రానికి 'జగనే ముఖ్యమంత్రి ఎందుకు కావాలి' కార్యక్రమం జరిగింది. తొలుత సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. తహసిల్దార్ ప్రసన్న కుమార్, ఎంపీపీ సింధు, వైస్‌ఎంపీపీ కుమారి, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, వీఆర్వోలు, నాయకులు ఎస్ఎం.సురేష్, కులశేఖర్ రెడ్డి, దేశప్పన్, ఎంపీటీసీ సభ్యుడు రాజ, సర్పంచ్ మహేంద్రన్ పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి దీవించాలి

కేవీబీపురం: రానున్న ఎన్నికల్లో ప్రజలందరు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి దీవించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రజలను కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య అధ్యక్షతన మండలంలోని ఆరె గ్రామంలో 'జగనే ముఖ్యమంత్రి ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని తెలిపారు. మరిన్ని పథకాలు రావాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అనంతరం పథకాల లబ్ధి బోర్డును ప్రారంభించారు. స్థానిక నేత మూర్తి డిల్లీ బాబు, మూర్తి మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మూర్తి సుబ్బయ్య, నాయకులు నందకుమార్, లాల్ బాబుయాదవ్, బొర్రా మాధవి రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి కోసం..

ఏర్పేడు: రాష్ట్రంలో మరింత అభివృద్ధి కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బండారుపల్లెలో 'జగనే ముఖ్యమంత్రి ఎందుకు కావాలి' కార్యక్రమం జరిగింది. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. రాత్రి భోజనం చేసి గ్రామంలో బస చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, సర్పంచ్‌లు జీవిత, మునిరామయ్య, పెంచలయ్య, వైస్ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పథకాల అమలు జగనన్నకే సాధ్యం

పిచ్చాటూరు: రాష్టంలో సంక్షేమ పథకాల అమలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ వి.సునంద తెలిపారు. మంగళవారం మండలంలోని కీళపూడి సచివాలయ పరిధిలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. ఆమె మాట్లాడుతూ కీళపూడి సచివాలయ పరిధిలో ఈ నాలుగున్నర ఏళ్లలో సంక్షేమానికి, అభివృద్ధికి మొత్తం రూ.33 కోట్లు వెచ్చించినట్లు వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు రాత్రి గ్రామ పెద్దలతో కలిసి భోంచేసి, రాత్రి బస చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కేవీ చలపతి రాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ పాలపద్మనాభం, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మధుసూదన్‌రావు, సర్పంచ్ కల్పన, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రమేష్ రాజు, సుబ్రమణ్యం, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కేవీబీపురం ఆరె గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

జగనన్నతోనే అభివృద్ధి

సత్యవేడు: ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆరూరులో ప్రగతి బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఎగుర వేశారు. చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బి.సోమశేఖర్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పంచాయతీ పరిధిలో వివిధ పథకాల ద్వారా 8.45కోట్లు లబ్ధి పొందారని వివరించారు. ఎంపీడీఓ కె. చంద్రశేఖర్, సర్పంచ్ అలిమేలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు సురేంద్ర, సర్పంచ్ కె. నీరజ, యూత్ వింగ్ అధ్యక్షుడు గోవిందస్వామి, ఈఓపీఆర్డీ ముని రవికుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

బుచ్చినాయుడుకండ్రిగ: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరాలంటే సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గాజులపెళ్లూరు గ్రామ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. తొలుత వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, సంక్షేమం, అభివృద్ధి డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫేస్టోను 98శాతం అమలు చేశారని, అభివృద్ధిలోనూ ముందున్నామనే నిజంతో ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమమే 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' అని తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ హరనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, గురునాథం, వైస్ ఎంపీపీ బాబు రెడ్డి, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, హరిబాబు, భాస్కర్‌రెడ్డి, ఇమామ్‌బాషా, వెంకటయ్య, శంకరయ్య, దేవదాసురెడ్డి, సర్పంచ్ గంగయ్య పాల్గొన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

వరదయపాలెం: మండలంలోని చిన్నపాండురు సచివాలయంలో బుధవారం జరిగే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దయాకర్ రెడ్డి తెలిపారు సాయంత్రం 4 గంటల నుండి జరిగే ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.



గాజులపెళ్లూరులో జెండాను ఆవిష్కరిస్తున్న విద్యానాథరెడ్డి



నాగలాపురం : వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం



ఏర్పేడు: కరపత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



సత్యవేడు: బోర్డును ఆవిష్కస్తున్న చంద్రశేఖర్ రెడ్డి



శ్రీకాళహస్తి : పాల్గొన్న నాయకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం బీవీపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కావాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎంపీడీవో రఫీ, సర్పంచులు మౌనిక, సురేంద్రయాదవ్, వెంకటేష్, కిరణ్, నాగభూషణ, కలివేలయ్య, కోటి, చెంగల్‌రాయల తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలన

వరదయపాలెం: రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా: మధ్యవర్తుల ప్రమేయం లెకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సంక్షేమ పథకాల లబ్ధి జమచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి మళ్లీ అవసరమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని మత్తేరిమిట్ట సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సంక్షేమ లబ్ధి డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్తేరిమిట్ట సచివాలయ పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా రు.24.52 కోట్ల లబ్ధి చేకూరినట్లు వివరించారు. గత నాలుగున్నర ఏళ్లలో మండలంలోని 13 సచివాలయాల్లో రూ.380 కోట్ల లబ్ధి ప్రజలకు అందినట్లు తెలిపారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దయాకర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబు రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సర్పంచులు సింధుజ, రమణయ్య, కిషోర్, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, జేసీఎస్ కన్వీనర్ చిన్న, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, తహసీల్దారు గౌరిశకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీరాణి

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు పాఠశాలలో మంగళవారం మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని సరస్వతిబాయి మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో జవహర్‌లాల్ నెహ్రూ జన్మదిన సందర్భంగా మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయందూరు పాఠశాలలో, యువనేస్తం అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో రాజులపాలెం, చిందేపల్లి ఎస్టీ కాలనీల్లో నెహ్రూ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈఓ-2 దయాకర్, యువనేస్తం అసోసియేషన్ సంస్థ వ్యవస్థాపకుడు మునిశేఖర్, అరుణ, నాగమణి పాల్గొన్నారు.

వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

సత్యవేడు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో సత్యవేడు మండలం మదనంబేడు జెడ్పీహైస్కూల్ విద్యార్థి విశ్వ ఉత్తమ ప్రతిభ కనబరచి రజత పతకం సాధించినట్లు పీఈటీ స్వర్ణ తెలిపారు. మంగవారం ఈ మేరకు విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు చినబాబు అభినందించారు.

వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్యే నివాళి

పిచ్చాటూరు: మండలంలోని పులికుండ్రం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత వడివేలు(60) సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం ఉదయం పులికుండ్రం చేరుకున్నారు. వడివేలు భౌతిక కాయానికి నివాళి అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు కెవి చలపతి రాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ రాజు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మెగా చీకటి ఒప్పందం

- రైతుల పొలంలో మట్టి అమ్ముకుని మోసం
- డబ్బులడుగుతారని రైతులపై కేసు పెట్టేందుకు యత్నం

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం దొంగలముడూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు చీకటి వేణు చీకటి వ్యాపారాలతోనే జీవనం సాగిస్తున్నాడని శివనాథపాలెం గ్రామానికి చెందిన రైతులు శేషాద్రి ,నరేష్ మరికొందరు రైతులు తీవ్రంగా దుయ్యబట్టారు. మంగళవార వారు విలేకరుల సమావేశంలో మట్లాడుతూ ఇతపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. మెగా కంపెనీకి చెందిన సురేష్ అనే ఉద్యోగితో లాలూచీ ఒప్పందం కుదుర్చుకుని గ్రావెల్ బ్రోకర్ అవతారం ఎత్తాడని, రైతుల పొలాల్లో మట్టి అమ్ముకుని జీవితం గడుపుతున్నాడని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కుటుంబంపై బురద చల్లేందుకు పచ్చ పత్రికలో 'ఎమ్మెల్యే కూతురు పిలుస్తోందని తీసుకెళ్లి చితక బాదారు' అంటూ పిచ్చి రాతలు రాయించుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటి పేరు తగ్గట్టే చీకటి జీవితమని ఎద్దేవా చేశారు. మెగా కంపెనీ గ్రావెల్ బ్రోకర్ అని చెప్పుకుంటూ శివనాథపురం, పార్లపల్లి ,చోడవరం గ్రామాల్లో రైతులు వద్ద ఏప్రిల్, మే నెలలో పొలంలోని మట్టిని తోలుకున్నాడని, డబ్బులు అడిగితే కంపెనీ నుంచి ఇంకా రాలేదు, కావాలంటే అడగండి అంటూ కంపెనీలో పని చేసే సురేష్ అనే ఉద్యోగితో చెప్పించాడన్నారు. ఇతనిపై తమకు నమ్మకం లేకపోయినా ఆ ఉద్యోగి మాటలు నమ్మి మూడు నెలలు వేచి ఉన్నామని రైతులు తెలిపారు. ఆ ఉద్యోగి వేణుతో లాలూచిపడి రైతుల డబ్బులను వేణు భార్యాబిడ్డల పేరున జమ చేశారని ఆరోపించారు. అతను ఎంతకు డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులందరం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డికి విన్నవించామన్నారు. ఆమె కంపెనీ పైస్థాయి అధికారులతో మాట్లాడగా ఆ డబ్బులు చీకటి వేణు అకౌంట్లో వేశామని తెలిపారని, ఈ విషయమై తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్లగా విషయం తెలుసుకుని తాను వారం రోజుల్లో డబ్బులు కడుతానని ప్రాధేయపడ్డాడన్నారు. ఆ తర్వాత ఎంతకూ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడం, ఫోన్ ఎత్తక పోవడంతో విసిగి వేశారని, అతను బస్టాండు వద్ద కనపడగానే రైతులు నిలదీసి, కేసు పెడతామని చెప్పారని తెలిపారు. ఈ సందర్భంగా వేణు 'డబ్బులు ఇవ్వను ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ దాడికి దిగాడని, తోపులాట జరిగిన మాట వాస్తవమేనన్నారు. అయితే వేణు తాను ఉదయం డబ్బులు చెల్లిస్తానని అక్కడ నుంచి వెళ్లి పోయాడని చెప్పారు. తనపై చీటింగ్ కేసు ఎక్కడ పెడతారోనని ముందస్తుగా ప్రభుత్వాస్పత్రిలో చేరి మెడ, కాళ్ళు నొప్పులు అంటూ డ్రామాలాడి అనంతరం తిరుపతికి పారిపోయాడని తెలిపారు.



జరిగిన మోసాన్ని వివరిస్తున్న శివనాథపురం రైతులు

ఫిర్యాదు ఇవ్వడానికి రాలేదు

టూ టౌన్ సీఐ మల్లికార్జున్‌ను ఈ విషయమై మాట్లాడుతూ చీకటి వేణు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి తనను కొట్టిన వారిపై ఫిర్యాదు చేస్తానని పోలీసులకు చెప్పాడన్నారు. ఫిర్యాదు ఇవ్వాలని కోరగా అతను రాలేదన్నారు. తొట్టంబేడు సీఐ విక్రమ్ మాట్లాడుతూ రైతులు ఫిర్యాదు ఇస్తే వేణుపై కేసు నమోదు చేస్తామన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని గ్రంథాలయంలో మంగళవారంగ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని జాతీయ జెండాను ఎగురవేశారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో భువనేశ్వరి, గ్రంథాలయ అధికారి లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దినచర్యగా పుస్తక పఠనం

నారాయణవనం: బాల్యం నుంచే ప్రతి ఒక్కరూ పుస్తకాలను, దినపత్రికలను చదవడాన్ని దినచర్యగా చేసుకోవాలని పలువురు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక గ్రంథాలయంలో ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి ష ణ్ముగం, గ్రంథాలయాధికారి జీవన్, ప్రజాప్రతినిధులు చిన్నదొరై, సారకాయలు, మోహన్ పాల్గొన్నారు.

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : పుస్తక పఠనంతో అపార జ్ఞానాన్ని సముపార్జించవచ్చని తొట్టంబేడు శాఖ గ్రంథాలయ అధికారి హరికృష్ణ అన్నారు. తొట్టంబేడు గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పించారు.

నాగలాపురంలో..

నాగలాపురం : నాగలాపురం గ్రంథాలయంలో వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, ఎంఈఓ బాబయ్య, ఎంఈఓ జనార్దన్ రాజు, పంచాయతీ ఈఓ నాగరత్నం, గ్రంథాలయ అధికారి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు శ్యామ్, మోహన్ మొదలియార్, ఎల్ సురేష్, దేశప్పన్, వైస్ సర్పంచ్ సునీత పాల్గొన్నారు.

పాఠశాల క్రీడా మైదానం ఆక్రమణ

- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని ఇదే గ్రామానికి చెందిన భూస్వాములు ఆక్రమించడంతో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పేరంట్స్ కమిటీ చైర్మన్ ధనంజయులు మాట్లాడుతూ తహసీల్దారు విచారణ జరిపి ఆక్రమణకు గురైయిన రూ.కోట్లు విలువ చేసే పాఠశాల భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, వీఆర్ఓ మురళి పాఠశాల భూమి ఆక్రమణ అడ్డుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.



విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన